"ఇంకా ఒక్కరోజు పూర్తి కాలేదుగా సూర్యారావ్! ఇరవై నాలుగు గంటలు పూర్తికానీ, తప్పక వదిలేస్తాను."

"ఈ రాత్రి నా కూతురు నీ దగ్గర వుండడం ఇష్టంలేదు. నా మీద నమ్మకం వుంచి వదిలెయ్యి."

"నామీద మీరూ నమ్మకం వుంచండి. రేప్రొద్దున వదిలేస్తాను. ఈ లోపులో నాకో చిన్న సాయం కావాలి."

"ఏమిటది?"

"ఇప్పుడు మీరెక్కడికి వెళ్తున్నారు?"

"గెస్ట్‌హౌస్‌కి. ఇంతకీ నీ పని ఏమిటో చెప్పలేదు."

"నాకు అర్జెంటుగా అయిదువేలు కావాలి."

"మిస్టర్ -- నీ కోర్కెలు ఒక్కటొక్కటే పెరుగుతున్నాయి. నేను ఇవ్వను."

"చాలా అవసరం"

"రేపు ఇంకా అడగవని నమ్మకం ఏమిటి?"

"సూర్యారావ్! యి చాలా చిన్న కోర్కెలు. అడగదల్చుకుంటే మొదటే యాభై వేలు అడిగి వుండేవాడిని. చెప్పు అడిగితే, ఇచ్చేవాడివి కావా ..... "

సూర్యారావు మాట్లాడలేదు.

"రాత్రికి వస్తాను. అయిదువేలు సిద్ధంగా వుంచు."

"నా కూతురు----"

"రేప్రొద్దున్నే క్షేమంగా వస్తుంది." ఫోన్ కట్ అయింది.

సూర్యారావుకి అర్థం కాలేదు. ఎందుకంత అర్జెంటుగా అతను అయిదువేలు అడిగాడు? అతనన్నట్టు అనుకోని అవసరం వచ్చిందేమో!..... నిజంగా బ్లాక్ మెయిలర్ అయితే అయిదువేలతో సరిపెట్టడు.

సూర్యారావు గెస్ట్‌హౌస్‌కి బయలుదేరాడు.

* * *

బయట ఉరుముతోంది.

గెస్టుహౌస్ ముందు ఒక రిక్షా ఆగింది. అందులోంచి సునాదమాల దిగింది. కాస్త భయంగా వుంది. కానీ అయిదు నిముషాల క్రితం వరకూ విహారి ఆమెకి ధైర్యం నూరిపోసి పంపాడు.

ఆమె లోపలికి వెళ్ళబోతూంటే వాచ్‌మెన్ అడ్డగించాడు.

"సూర్యారావు గారి కోసం, ఈ టైముకి రమ్మన్నారు."

వాచ్‌మెన్ కాస్త తటపటాయించి తలూపాడు.

రావటంతో ఆశ్చర్యపోయి “ఎవరు నువ్వు” అని అడిగాడు.

“మా ..... మా ..... మా బావ పంపించాడు” అంది - అప్పచెపుతున్నట్టు.

“ఎవరు మీ బావ?”

“విహారి” అందామె బెరుకుగా చూస్తూ. ఆమె నుదుట చెమట పట్టింది. మీరు ఐదువేలు ఇస్తారు తీసుకురమ్మన్నాడు.”

“తనే రావొచ్చుగా నిన్ను పంపాడేం?”

గుటకమింగి, “నేను వెళ్ళిపోతాను” అంది.

“అదేమిటి?”

“నాకు భయమేస్తోంది”

సూర్యారావు బిగ్గరగా నవ్వాడు. “నీకూ మీ బావకీ ఈ దొంగతనాలూ అవీ కొత్తలా వున్నట్టున్నాయే?”

సునాదమాల మాట్లాడలేదు.

“అసలు మీ బావకి కిడ్నాపింగ్ అంటే అర్థం తెలుసా? నేను నిన్ను యిక్కడ అట్టే పెట్టి, నా కూతుర్ని వదిలే వరకూ నిన్నొదల్ను అంటే ఏం చేస్తాడు?”

“నాకు తెలీదు. నేను వెళ్ళిపోతాను”

“వద్దులే. ఇదిగో అయిదువేలు, తీసుకో ” అంటూ కట్ట అందించాడు. మెరుపుల మధ్య ఫ్లాష్ వెలిగింది.

ఆమె ఆ డబ్బు చేతిలో పట్టుకుని అతనివైపు కన్నార్పకుండా చూసి - “థాంక్స్ ” అంది. బయటనుంచి మెరిసిన మెరుపు వెలుగుల్లో ఆమె అద్భుతంగా వుంది. ఆకాశ దేశాన నీలి జెండాలెత్తినట్టు - సంధ్యా దేవి మెడలో గొలుసు కదిలినట్టు - చరణమంజీర హేమ గాత్రి - సంధ్య వెన్నెల చెంగల్వరాత్రి ..... కాంక్షా ధనస్సు వొంగి - కనులు ఎరుపుతనం పొంగి ..... శరత్ పూర్ణంలో ఎవరెస్టు శిఖరాలు రెండు - ఆరంగుళాల పైన ఆమె చిరునవ్వు - సముద్రం మీద జాబిల్లి సంతకంలా .....

“అలా చూడకండి మీ అయిదువేలూ తీసేసుకోండి. నేను వెళ్ళి పోతాను” టేప్ రికార్డర్ ఆన్ చేయగానే మొదటిమాట ఆమెది అది.

నిజానికి అలా చూడలేదు సూర్యారావు. ఇప్పుడు చూశాడు. ఉరుమే తారమంజీరమై మెరుపే మందార మాలయై - చీకటి - కాంక్షా కాశ్మీరాలంబరమై, తొలి రేవున లంగరెత్తిన వడి కోర్కె - వెనుక కదలిక .....

“ఈ అయిదువేల కోసమే వచ్చాను. మీరు నా మీద చెయ్యి వేశారంటే అరుస్తాను” ఆమె భయంగా అంది. అహం దెబ్బతిన్న సూర్యారావు అనాలోచితంగా నవ్వాడు. “అరచినా ఇక్కడ ఎవరికి విన పడదు.”

“ఒక చిన్న పనికోసం నేను ఇక్కడికి వస్తే ... దాన్ని మీరిలా ఉపయోగించుకోవటం

అన్యాయం ..... " అంటూనే అతడివేపు అడుగువేసింది. కోనేట్లో స్నానమాడిన గాలి గుడిగంట మ్రోగించటానికి దక్షిణం దిక్కుగా పయనించినట్టు ఒక మధురమైన పరిమళం అతన్ని చుట్టుముట్టింది. వర్షపు చినుకు గుమ్మం తలుపు తట్టినట్టు, పడకగదిలో అగరొత్తి పలకరించినట్టు, పూల పైటని చెట్టుమీదనుంచి తొలగిస్తూ గాలి తుమ్మెర నవ్వినట్టు -

భ్రమించి --

అతనామె చెయ్యి పట్టుకున్నాడు. మరో ఫ్లాష్ వెలిగింది. అదే గుర్తు!

అంతే .....

స్టెన్‌గన్ సోల్జర్ పేరాచ్యూట్‌తో జెట్ విమానం నుంచి దూకినప్పుడు కదిలే మెళకువల కదలిక ఆమెను అదేశించింది -- కోకుల వదూక మతికాంతి నలతాంత రతికాంతర నితాంత రతికాంత రణకాంత సుతనుకాంత ..... చిలిత కలిత కలకంఠ కాకలీ విభాసురము వొల్చు ..... అన్నట్టు ఆమె రియాక్టయింది. ఒక చెయ్యి తన జాకెట్ వైపు, మరొక చెయ్యి మెడవేపు వేగంగా వెళ్ళినయ్.

తను చేస్తున్నది లజ్జా రహితమైన పని అని ఆమెకు తెలుసు. కానీ ఆమె కనుల ముందు చనిపోయిన తన విప్లవ స్నేహితుడు వినీల్ కదిలాడు. పద్మాకర్ శవం కదలాడింది. పదవీ కాంక్ష కోసం ప్రజల్ని పావులుగా వాడే పరాన్న భుక్కుమీద ప్రతిఘటన కోసం పదిహేడు సంవత్సరాల యవ్వనం పేపర్‌లో పడేతేనేమి?

ఆమె చెయ్యి జాకెట్‌ని చింపుకుంది. ఆమె కుడి స్థనం సువర్ణ కళశంలా మెరిసింది. గోరు మెడను గీరుకుంది. రక్తచందనం మెడకు పూసినట్టయింది.

ఒకప్పుడు ఆమె పరాయి పురుషుడి నీడ పడితేనే వెళ్ళి స్నానం చేసే అమ్మాయి పోస్టుమాన్ చేయి తగిలితేనే కొబ్బరి పీచుతో రుద్దుకునే అతివ. అటువంటిది తనకు అప్పగించిన కార్యాన్ని వంటరిగా నిర్వ ర్తించింది. వేల వేల అజ్ఞాత సైనికులు తమ దేశం కోసం ఎలా ప్రాణాలొదిలింది. అన్యాయాన్ని ఎదుర్కోవటం కోసం మహనీయులు ఎంత కష్టపడిందీ, ఆ క్రితం రాత్రి విహారి, ఆమెకు, సూర్యారావు కూతురికి కూచోబెట్టి చెప్పాడు. విప్లవం ఎప్పుడో ఎక్కడ్నుంచో రాదు - మనమనుంచే రావాలి. మనిషిలో మార్పుకూడా అంతే ఒక మంచి సహచరుడి మాటలవల్ల వస్తుంది. అకస్మాత్తుగా వస్తుంది. ఈ రోజు ఆమె ప్రదర్శించిన ధైర్యాన్ని, కొద్దిరోజుల క్రితం చెపితే - ఆమె కలలో కూడా నమ్మి ఉండేది కాదు. అంత ఎదిగింది ఆమె.

"హెల్ప్ ..... హెల్ప్ ..... హెల్ప్ ..... రక్షించండి" అని ఆమె అరిచింది. అప్పటికే ఏదో అనుమానం వచ్చిన సూర్యారావు బిత్తర పోయాడు. అంతలో తలుపులు హఠాత్‌గా తెరుచుకోవడం, సూర్యారావు షాక్ నుంచి తేరుకునే లోపుగా నలుగురైదురుగురు వ్యక్తులు బిలబిలా లోపల ప్రవేశించటం వెంట వెంటనే జరిగిపోయాయి.

* * * *

మరుసటిరోజు పేపర్లో ఈ వార్త హెడ్‌లైన్స్‌లో వచ్చింది.

అత్యాచార ప్రయత్నంతో కేంద్రమంది అరెస్టు లంచంతో పాటు మానాన్ని కూడా దోచుకోవడానికి ప్రయత్నించిన మంత్రి సూర్యారావు.

వివిధ రకాల హెడ్డింగ్‌లు పెట్టి పేపర్లు ప్రకటించాయి. సునాదమాల ఫోటో కూడా ప్రచురించబడింది.

“సునాదమాల అనే యువతి, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి స్వంతముగా ఒక చిన్న పరిశ్రమ పెట్టుకుందామని మంత్రిని కలుసుకుంది. ఆమెని సాయంత్రం గెస్ట్‌హౌస్‌కి అయిదువేలు పట్టుకుని రమ్మన్నాడు మంత్రిగారు. చిన్న పరిశ్రమకి మంత్రి అంత పెద్ద వ్యక్తి అవసరం లేదని తెలియనంత అమాయకురాలు ఈ కోర్కెకి భయపడి పోలీసులకి చెప్పింది. డి.ఐ.జి. స్వయంగా పూనుకున్నాడు. వల వేసి సూర్యారావుని పట్టుకోవటం జరిగింది. సూర్యారావుకీ, సునాదమాలకీ మధ్య సంభాషణ మధ్య టేప్ రికార్డు చేయబడింది ..... ” “అలా చూడకండి. మీ అయిదువేలు తీసుకోండి ” “..... అరిచినా ఇక్కడ ఎవరికీ వినపడదు” అన్న మాటలు వున్న టేపును డి.ఐ.జి. స్వయంగా పత్రికా విలేఖరులకి వినిపించారు. వార్తతో పాటు మాల ఫోటో - పెద్ద పెద్ద కళ్ళు - కళ్ల నిండా భయం, చిరిగిన జాకెట్ - ఆమె చెయ్యి పట్టుకున్న సూర్యారావు ..... అంతకన్నా ఏం కావాలి? అరెస్టు బెయిల్ మీద విడుదల - మంత్రి వర్గం నుంచి సస్పెండ్ అవటం- అన్నీ క్షణాల్లో జరిగిపోయాయి.

ఈ కేసు నిర్వహించిన డి.ఐ.జి ప్రవల్లికకి చాలా దగ్గర సహచరుడని కొద్దిమందికే తెలుసు. విహారితో పాటు ఆమెకూడా తెర వెనుకే వుండి నిర్వహించింది. సూర్యారావు బెయిల్‌మీద విడుదల అయ్యాక విహారిని కలుసుకుంది. “ఈ రాత్రి సూర్యారావు చేసే భోజనంలో ఈ మందు కలపాలి” అంటూ సీసా ఇచ్చాడు విహారి.

“ఎందుకు?” అంది ఆశ్చర్యంగా. “అతడి కథ పూర్తయిందిగా?”

“అసలు కథ ఇప్పుడే మొదలవుతుంది”

* * *

రాత్రి భోజనం పూర్తిచేసి సూర్యారావు బెడ్‌రూంలో కూర్చుని వున్నాడు.

దాదాపు ఎనిమిది గంటలనుంచి అతడు ఎవరితోనూ మాట్లాడటం లేదు. ఎవరికి ఇంటర్వ్యూ ఇవ్వటంలేదు. పేపర్‌లో పడిన ఒక్కొక్క వాక్యం అతడి గుండెని కోసేస్తూ వుంది నిన్నటి వరకూ ప్రజలు నీరాజనం పట్టిన మంత్రి - ఈ రోజు కనబడితే కొట్టేటట్టు వున్నారు. ఎవరి మీదో తెలియని కసి - ఆ విహారిని చంపి పాతెయ్యాలన్నంత ఆవేశం, స్వామికి ఫోన్ చేద్దామంటే దొరకటంలేదు. అలాగే కూర్చుని ఉన్నాడు.

కూతురు గదిలోకి వచ్చింది.

ఆమె క్రితం రాత్రే ఇంటికొచ్చింది. తండ్రి అరెస్ట్ హడావుడిలో ఆమెని ఎవరూ పట్టించుకోలేదు.

“క్షమించు నాన్నా! ఇదంతా నావల్లే జరిగింది” అంది.

"నువ్వేం చేస్తావమ్మా! అంతా నా ప్రారబ్ధం కానీ ఒట్టేసి చెపుతున్నాను - ఆ అమ్మాయి మీద నేను చెయ్యి వెయ్యలేదు. అది జాకెట్టు చింపుకుంది. ఆ విహారిగాడు ఆడిన నాటకం అది"

ఆ అమ్మాయి ఆశ్చర్యంగా చూస్తూ - "విహారా?" అంది.

"అదే, నిన్ను కిడ్నాప్ చేసినవాడు"

"కానీ అతను నిన్న రాత్రే నన్ను వదిలేశాడే?"

సూర్యారావు పిడుగుపడ్డట్టు చూశాడు - "నిన్నరాత్రే వదిలేశాడా?"

"అవును నాన్నా! రాత్రే యింటికి వచ్చేశాను. నువ్వు గెస్ట్‌హౌస్‌లో వున్నావన్నారు. ఎలా చెప్పాలో తెలియలేదు."

ఆమె చెప్పిన దానిలో అబద్ధం ఏమీలేదు. గెస్ట్‌హౌస్ ఫోన్ విహారి కట్ చేశాడంతే.

"అతను నిన్న రాత్రే ఎందుకు వదిలేశాడు?"

"నాకుతెలీదు."

"సూర్యారావు విహారి నెంబర్ వెతికి ఫోన్ చేశాడు.

"నా కూతుర్ని నిన్నే వదిలేశావా?"

"అవును! నాకు కావలసిన అగ్రిమెంటు మీద సంతకం ఒకరోజు అలస్యమవటం, అది జరగగానే మీ కూతుర్ని వదిలేశాను."

"అయిదువేలు అడగటం-"

"ఐదువేలు అడగటం ఏమిటి?"

"మీ మేనకోడల్ని పంపావు కదా----""

"మేనకోడలు ఎవరు?"

సూర్యారావుకి టెన్షన్ పెరిగిపోయింది.

"ఓ ఐదువేలు ఇమ్మని నువ్వు నన్ను బ్లాక్ మెయిల్ చేయలేదూ?" అనరిచాడు.

"చూడు మిస్టర్ సూర్యారావు - నాకు నిజాయితీ వుంది, డబ్బు వుంది. అదీగాక నువ్వు అడిగేది నాకు లాజిక్‌కి కూడ అందటంలేదు. కావలిస్తే రెండు పనులూ ఒకేసారి అడుగుతాను కాని - కొసరి కొసరి ఎందుకు అడుగుతాను? ఎవరో నాలా స్వరం మార్చి నీతో మాట్లాడి వుంటారు. నేనయితే వాగ్ధానం చేసినట్టు నా పని అయిపోగానే నీ కూతురిని వదిలేశాను" అని ఫోన్ పెట్టేశాడు విహారి.

సూర్యారావుకు మతిపోయింది.

ఎవరో గొప్ప నాటకం ఆడి తన పదవి పోయేటట్లు చేశారు. ఎవరు?

స్వామా?

ఆ ఆలోచన రాగానే సూర్యారావు ఉలిక్కిపడ్డాడు.